నిజం మా నైజం...!

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

RNI NO:TELTEL/2022/81794

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ   సంపుటి: 5   సంచిక: 36   ఆదివారం, 05 జూలై 2026   పేజీలు -   వెల : 3/-


వాస్తవ తెలంగాణ
విలేఖరులు కావలెను
call:8499002860

# 6 ఎకరాల లోపు రైతు భరోసా నిధులు విడుదల



**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వానాకాలం సీజన్‌కు గాను ఆరు ఎకరాల లోపు రైతులకు 'రైతు భరోసా' నిధులను విడుదల చేసింది. 5 నుంచి 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన 1.68 లక్షల మందికి పైగా లబ్ధిదారులైన రైతుల ఖాతాల్లో రూ. 545.40 కోట్లను ప్రభుత్వం విజయవంతంగా జమ చేసింది. జూన్ 30న ప్రారంభమైన ఈ పెట్టుబడి సాయం పంపిణీ ప్రక్రియ.. ఇప్పటి వరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.78 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. అర్హులైన ప్రతి రైతుకు దశలవారీగా రైతు భరోసా సాయాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## పంట మార్పిడి, ఆయిల్ పామ్ పంటల సాగు ను ప్రోత్సహించాలి

2

# టీఆర్ఎస్.. కుదరదు!

## వేరే పేరు మార్చుకోండి

- కవితకు సీఈసీ లేఖ
- తెలంగాణ రక్షణ సేన పేరు మార్చాలని ఆదేశం
- 15 రోజుల్లోగా మూడు పేర్లు సూచించాలన్న ఈసీ




**వాస్తవ తెలంగాణ** :రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన పేరుపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పేరు మార్చాలని స్పష్టం చేస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆ పార్టీ అధినేత్రి కవితకు అధికారిక లేఖ పంపారు. కాగా, కవిత తన కొత్త పార్టీని తెలంగాణ రక్షణ సేన పేరిట నమోదు చేయాలని ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. గతంలో కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర సమితి ఇదే సంక్షిప్త నామాన్ని ఉపయోగించిన నేపథ్యంలో, కొత్త పార్టీ కూడా అదే టీఆర్ఎస్ పేరును వినియోగిస్తే ఓటర్లలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. ఈ కారణంగా పార్టీ పేరును మార్చాలని ఆదేశించింది. ఇదే సందర్భంగా ఈ పేరుపై బీఆర్ఎస్‌తో పాటు వివిధ వర్గాల నుంచి ఎన్నికల సంఘానికి అభ్యంతరాలు, ఫిర్యాదులు అందాయి. అంతేకాకుండా, మహారాష్ట్రకు చెందిన మరో సంస్థ కూడా ఇదే పేరుతో దరఖాస్తు చేసుకోవడం వల్ల ఈ అంశం మరింత వివాదాస్పదంగా మారింది.ఈనేపథ్యంలోనేఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. రాబోయే 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని ఎన్నికల సంఘం కవితను ఆదేశించింది. నిర్దిష్ట గడువులోగా ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించకపోతే, పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మూసివేస్తామని హెచ్చరించింది. ఎన్నికల సంఘం లేఖపై కవిత ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# మంత్రి జూపల్లి రాజీనామా చేయాలి

**మెదక్ వాస్తవ తెలంగాణ** ప్రభుత్వం చేసిన అప్పుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కష్ణారావు చెబుతున్న లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శుక్రవారం సంగారెడి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం, సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అప్పులపై ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. అసెంబ్లీలో సీఎం చెప్పిన అప్పుల వివరాలకు, మంత్రి జూపల్లి విడుదల చేసిన లేఖలోని లెక్కలకు తేడా ఉందని హరీశ్ రావు అన్నారు. ఇందులో ఎవరు నిజం చెబుతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు బిడ్డవైతే.. పౌరుషం ఉంటే వెంటనే రాజీనామా చెయ్యి మిస్టర్ జూపల్లి అని సవాల్ విసిరారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అప్పులు రూ.4 లక్షల కోట్లేనని, దీనికి కాగ్ నివేదికే సాక్ష్యమని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అభివద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టులను అటకెక్కించడంతో పాటు సింగూరు ప్రాజెక్టు మరమ్మతులను విస్మరించిందన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు గిరిజనుల భూములను లాక్కుంటోందని విమర్శించారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రచారం చేస్తున్న ప్రభుత్వం, హైదరాబాద్‌కు తాగునీరు అందిస్తున్న మల్లన్నసాగర్ గురించి మాట్లాడడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ



వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు, పాదయాత్రలు చేపడతా మని హెచ్చరించారు. కాంగ్రెస్ మంత్రులు గోల్ కొడుదాం అనుకుంటే సెల్ఫ్ గోల్ అయిపోయిందని ఎద్దేవా చేశారు.

**అటకెక్కిన సంగమేశ్వర-బసవేశ్వర**

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును అటకెక్కించి సంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల గురించి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కరోజైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన మంత్రి ఈ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. మీ నియోజకవర్గాల్లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు ఇస్తే, మా సంగారెడ్డి జిల్లాకు, మా రైతులకు ఉపయోగపడే సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే ఈ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, పాదయాత్రలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతు చేస్తాం అని చెప్పి ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఓట్ల తొలగింపు కుట్రలను తిప్పికొట్టాలని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంగారెడ్డిలో ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములు లాక్కుంటున్న కాంగ్రెస్ సర్కార్ కు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యేలు మాణిక్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, శశిధర్ రెడ్డి, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నాయకులు డా.శ్రీహరి, కాసాల బుచ్చిరెడ్డితో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో అప్పు రూ.8.21 లక్షల కోట్లు

**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** బీఆర్ఎస్ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అప్పు రూ.8,21,651 కోట్లని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ అప్పులపై కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దోపిడీకి కారణం ఆయనేనన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు సమాధానం చెప్పడానికి వారి స్థాయి ఏంటని ప్రశ్నించారు. ఎవరు ఏంటనేది ఇప్పటికే ప్రజలు నిర్ణయించారనీ, స్థాయి అనేది పుట్టుకను బట్టి రాదనీ, ప్రజాజీవితంలో పోషించే పాత్రను బట్టి వస్తుందని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పదేండ్లపాటు అధికారంలో ఉండి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు అప్పులపై అబద్ధ పు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శిం చారు. 2014 నుంచి 2023 వరకు రూ.8,21,651 కోట్ల అప్పు చేస్తే కేటీఆర్ మాత్రం రూ.2.78 లక్ష?ల కోట్ల అప్పు చేశామని చెప్పడం సరైంది కాదన్నారు. అబద్ధాలను ప్రచార అస్త్రాలుగా మార్చుకుని, 'గోబెల్స్' ప్రచారానికి పాల్పడు తున్నారని దుయ్య బట్టారు. అబద్ధాల పునా దుల మీద ఏ ఆర్థిక వ్యవస్థను నిర్మించలేమనీ, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

**అప్పులు, వడ్డీలు కలిపి ?రూ.2.08 లక్ష?ల కోట్లు చెల్లించాం**

ఈ రెండున్నరేండ్లలోనే ప్రజాప్రభుత్వం రూ.1.77 లక్ష?ల కోట్ల అప్పు చేసిందని భట్టి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పుల కు రూ.2,08,681 కోట్లను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు చెల్లించిందని భట్టి వెల్లడించారు. కేవలం రూ.మూడు లక్షల కోట్లే అప్పు చేశామని కేటీఆర్, హరీశ్‌రావు అబద్ధా లు చెప్తే ఎలా? అని ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంక్ ద్వారా ప్రభుత్వ ఖాతాల నుంచి కట్టిన భారీ మొత్తం దేనికో వారే సమాధానం చెప్పా లని సవాల్ విసిరారు. భవిష్యత్ లోనూ




కేసీఆరే మళ్లీ వస్తారని కేటీఆర్, హరీశ్‌రావు అంటు న్నారని, అలాంటప్పుడు మధ్యలో వారు చేసే ఈ హంగామా దేనికోసమని ప్రశ్నిం చారు. వారికి గతం లేదు, భవిష్యత్ లేదు, కనీసం నైతి కత అయినా ఉండాలి కదా? అని అన్నారు.

**అప్పు భారం తగ్గించాం**

బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ బ్యాంకుల వద్ద 10 శాతం నుంచి 10.5 శాతం వరకు భారీ వడ్డీ రేట్లతో అప్పులు తెచ్చి రాష్ట్రంపై పెనుభారం వేసిందని భట్టి చెప్పారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఆ అప్పులను డెబిట్ రీస్ట్రక్చరింగ్ ప్రక్రియలోకి తెచ్చిందన్నారు. దీనివల్ల 2025-26 నుంచి 2031-32 మధ్య కాలంలో చెల్లించాల్సిన రూ. 34,058 కోట్ల రుణ భారాన్ని, రూ.11,915 కోట్లకు తగ్గించామని వివరిం చారు. దీని ద్వారా రాష్ట్రానికి రూ.22,142 కోట్లు ఆదా అయ్యిందని చెప్పారు. అడ్డగోలుగా అప్పులు తెచ్చిన వారు, ఇలాంటి ఆర్థిక నిర్వహణపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సింగరేణిపై విషప్రచారం ఆపండి!**

సింగరేణి సంస్థపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని భట్టి తప్పుబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆస్తులు, వనరులు రాష్ట్రానివని వివరించారు. "పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణికి కొత్తగా ఒక్క కోల్ బ్లాక్‌నైనా తెచ్చారా కనీసం ఉత్పత్తి అయిపోయి మూతపడిన మైనింగ్ బ్లాకులకు బదులుగా కొత్తవి ప్రారంభించారా'' అని సూటిగా ప్రశ్నించారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులను భారీగా విస్తరించిన కేసీఆర్ ప్రభుత్వం, వాటికి అవసరమైన బొగ్గు గనులను మాత్రం ఎందుకు సమకూర్చలేదని నిలదీశారు. కేంద్రం వేలం వేసిన కోల్ బ్లాకుల్లో పాల్గొని సింగరేణికి ఆ గనులను ఎందుకు దక్కించలేకపోయారని ప్రశ్నించారు. సింగరేణికి గనులు వస్తే రాయల్టీ రూపంలో వచ్చే ఆదాయం తెలంగాణకే చెందేదని అన్నారు. రాష్ట్రంలో బొగ్గు కొరత సృష్టించి, విద్యుత్ ప్రాజెక్టులను సంక్షోభంలోకి నెట్టడమే బీఆర్ఎస్ ఉద్దేశమా? అని ప్రశ్నించారు. సింగరేణి కాలరీస్‌లో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్త వమన్నారు.

# సర్ పేరుతో.. సర్కార్ కుట్ర

- హిందువుల ఓట్లను తొలగించే ప్రయత్నాలు
- మజ్లిస్ తో కాంగ్రెస్ కుమ్మక్కు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**జగిత్యాల జిల్లా మేడిపల్లి,** రాష్ట్ర ప్రభుత్వం "సర్" ను ఉపయోగించుకుని హిందువల ఓట్లను తొలగించేందుకు పెద్ద ఎత్తున కుట్ర చేస్తోందని కేంద్ర హోంశాఖ స హాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆరోపణ చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మేడిపల్లి, బీమారం, కథలాపూర్ మండలాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. సర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు సహకరించడం లేదన్నారు. ఫలితంగా అధికారులు క్షేత్రస్థాయిలో హిందువుల ఇండ్లకు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదన్నారు. హిందువులంతా జాగృతం కావాలని, లేనిపక్షంలో తెలంగాణలో హిందువులంతా మైనారిటీలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మజ్లిస్‌తో కుమ్మక్కై కాంగ్రెస్ హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందన్నారు.



**రహదారుల విస్తరణకు కృషి**

మోదీ ఆశీస్సులు, నితిన్ గడ్కరీ సహకారంతో గ్రామీణ ఉపాధి హామీ, ప్రధానమంత్రి సడక్ యోజన, సీఆర్ఎఫ్ నిధులతోపాటు జాతీయ రహదారుల విస్తరణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్ల కోసమే రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని, గత 7 ఏళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం 22 వేల కోట్లకుపైగా కేంద్ర నిధులు తీసుకొస్తే, అందులో రోడ్ల నిర్మాణం కోసమే 10 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. గతంలో తెలంగాణ మొత్తానికి 800 కోట్ల సీఆర్ఎఫ్ నిధులు మంజూరైతే.. అందులో ఒక్క కరీంనగర్ పార్లమెంట్ 291 కోట్లు తీసుకొచ్చి 1341 కిలోమీటర్ల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లను నిర్మించిన ఘనత మాదేనన్నారు. గ్రామీణ సడక్ యోజన పథకం కింద వందలాది కోట్లు ఖర్చు చేసి రోడ్లు నిర్మించామని తెలిపారు..

# దొడ్డి కొమరయ్య ఆశయాలు స్ఫూర్తిదాయకం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్





**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. దొడ్డి కొమరయ్య 81వ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...యువత దొడ్డి కొమరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు.ఈకార్యక్రమంలో డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, డీపీఓ యాదయ్య, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, డీఈఓ రాజు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యమే ప్రథమం సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లు స్వచ్ఛతకు ఆదర్శంగా ఉండాలి:జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి, సురక్షిత తాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందించాలని, వంటశాలలు, డైనింగ్ హాళ్లు, స్టోర్‌రూమ్‌లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. వంటకు ఉపయోగించే ఆహార పదార్థాల నాణ్యతను తరచూ తనిఖీ చేయాలని, ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. హాస్టళ్లలో సురక్షిత తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విద్యార్థులకు అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆహార తయారీ, నిల్వ, పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లను ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేసి, వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతపై నివేదికలు సమర్పించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, డిపిఓ యాదయ్య, డీఈవో రాజు , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గణేష్ వర్ జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల ప్రతినిధులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి..



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్..**ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతుడై దేశాభివృద్ధిలో తన సహకార అందించాలని నెట్ డాటా డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ అన్నారు. శనివారం రోజు నారాయణ ఖేడ్ మండలం పరిధిలోని సంజీవన్ రావు పేట్, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నెట్ డాటా సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా సభ్యులు చంద్రశేఖర ఆచార్య సౌజన్యంతో స్కూల్ బ్యాగ్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని సర్వాంగీణ వికాసం చెందాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రుల ఆశయ సాధనలో తమ ప్రయత్నం కొనసాగించాలన్నారు. తమ సంస్థ గత పది సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యా సామాగ్రితో పాటు లాప్టాప్ లు వీల్ చైర్స్ ప్రతి నెల రెండు కుటుంబాలకు నిత్యవసర వస్తువులు అందిస్తునామన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరిన్ని సంస్థలు ముందుకు రావాలని వారు కోరారు .కార్యక్రమంలో సర్పంచ్ లు జ్యోతి భూపాల్, శ్రీకాంత్, జకరయ్య,, ఆయా పాఠశాల హెచ్ఎంలు మహేశ్వరరావు ,సాఫ్ట్ వేర్ సంస్థ ప్రతినిధులు గీత గోసంగి , అమిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# దొడ్డి కొమరయ్య ఆశయాలు సాధించాలి..




**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణాఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులోగల అమరవీరుడు దొడ్డి కొమరయ్య విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన వర్ధంతి కార్యక్రమంలో ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన తెలంగాణ రైతాంగ పోరాటంలో చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను నేటి తరానికి ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు సాయిలు పటేల్,ఖేడ్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జ్ఞాన్ రెడ్డి,మాజీ మండల్ అధ్యక్షులు తాహిర్ అలీ,మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్, రాజు బాణపురం,కోప్సన్ సభ్యులు ముంతాజ్, ఫయాజ్, గొల్ల కురుమ సంఘం అధ్యక్షులు లొండే నర్సింలు, గొల్ల కురుమ సంఘం మాజీ అధ్యక్షులు ప్రభు, అంజన్న, దశరథ్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# పంట మార్పిడి, ఆయిల్ పామ్ పంటల సాగు ను ప్రోత్సహించాలి:

## కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలి:రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్



**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** పంట మార్పిడి విధానాలు, ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సీఎస్ సంజయ్ జాజు శనివారం హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు అధికారులతో వ్యవసాయ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 2026 - 27 సంవత్సరానికి 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలలో అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు. కూరగాయల సాగు వైపు దృష్టి సారించాలని వివరించారు. సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులు పాటించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. యూరియా, డిఎపి, ఇతర కాంప్లెక్స్ ఎరువులన్నీ రైతులకు సరిపడినన్ని అందించాలన్నారు. ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా ఈ అంశంపై పటిష్ట నిఘా ఉంచాలని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. దేశంలోనే ఫార్మర్ రిజిస్ట్రీలో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతం తో మొదటి స్థానంలో ఉందని అన్నారు. వర్షాకాలం




కాలానుగుణ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టరేట్లోని సమావేశం మందిరం నుంచి ఈవీసీ లో అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మండలాల వారిగా లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలను అమలుపరుస్తున్నామని చెప్పారు. రైతుల అవసరాల మేరకు యూరియాను అందిస్తామన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేశామని, వైద్య శాఖ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపార ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, వ్యవసాయ అధికారి దేవకుమార్, పంచాయతీ అధికారి యాదయ్య,డి,పి ఆర్ వో రామచంద్ర రాజు,జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్, ఇంటర్ విద్యాధికారి మాధవి,జిల్లా విద్యాధికారి రాజు,డి సి హెచ్ శివదయాల్, ఉద్యాన వన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ ,తదితరులు పాల్గొన్నారు.

## పుల్కల్లో మంత్రి దామోదర్ చొరవతో డబుల్ ధమాకా





**వాస్తవ తెలంగాణ న్యూస్ పుల్కల్ ప్రతినిధి** పుల్కల్ మండల కేంద్రంలో గత ఎనిమిది సంవత్సరాల క్రితం నిరుపేదల కోసం అప్పటి బి. ఆర్. ఎస్ ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి మండల కేంద్రంలో 44 డబుల్ బెడ్రూంలు నిర్మించింది కానీ అట్టి నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి గ్రామంలో ఉన్న నిరుపేదలు తమకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వస్తుందనే ఆశతో ఎంతోమంది లబ్ధిదారులు ఎదురు చూశారు కానీ వారి ఆశ నిరాశయింది నిరుపేదల కోసం నిర్మించిన భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది అంతేకాకుండా పశువులను సైతం అందులోనే ఉంచడంతో అట్టి భవనం నిరుపయోగంగా మారింది ఇట్టి విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్ కలుగజేసుకొని నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని పలుమార్లు మంత్రి దృష్టికి ఆయన తీసుకువెళ్లారు దీంతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి వెంటనే అట్టి భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి వ చ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు వెంటనే ఆ శాఖ అధికారులు అయినా హౌసింగ్ పీడీ చలపతిరావు ఏ ఈ శ్రీదేవి వారు అట్టి డబుల్ బెడ్ రూమ్ భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు అట్టి భవనం ముందు ఐదు లక్షల రూపాయలతో సిసి రోడ్డు వేయాలని సంబంధిత అధికారులకు పీడీ చలపతిరావు ఆదేశి0చారు అంతేకాకుండా అట్టి భావనాన్ని అన్ని విధాలుగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పనులను వేగవంతం చేయాలన్నారు దీంతో మంత్రి మాట్లాడుతూ పుల్కల్ గ్రామానికి ఎంత చేసినా తక్కువే నని మంత్రి అన్నారు ఎందుకంటే మంత్రిది సొంత గ్రామం కాబట్టి తన సొంత గ్రామానికి ఎంత అభివృద్ధి చేసినా తక్కువే అవుతుందన్నారు కావున పుల్కల్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు

తమ కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉ ందన్నారు పుల్కల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ గెలవకపోయినా గెలిచిన వారి కంటే రెట్టింపు అభివృద్ధి పనులు చేసి చూపిస్తామన్నారు తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు ఇతర పార్టీల పెత్తనం సాగదు గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు అతి తొందరలోనే పుల్కల్ గ్రామంలో ఉన్న నిరుపేద లను గుర్తించి అట్టి లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేస్తామని వారు అన్నారు దీంతో నిరుపేదల కళా సహకారం అవుతుందన్నారు ఇట్టి బెడ్ రూమ్ ల కోసం కృషిచేసిన బోయిని శ్రీనివాస్ గారికి పుల్కల్ గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ ప్రజలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ పీడీ: త్వరలోనే పట్టాల పంపిణీ...

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్





**పుల్కల్ వాస్తవ తెలంగాణ న్యూస్ జూలై 04** మండల కేంద్రంలో నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ నాణ్యతను, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ మాట్లాడుతూ... పుల్కల్ మండల కేంద్రంలోని అర్హులైన లబ్ధిదారులకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు అత్యంత త్వరలోనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నట్లు హౌసింగ్ పీడీ చలపతిరావు ప్రకటించారు. ఇళ్లకు సంబంధించిన అన్ని రకాల పనులను త్వరితగతిన పూర్తి చేసి, పంపిణీకి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. "అర్హులైన ప్రతి పేద వానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యే యం. ఎటువంటి అవకతవకలు లేకుండా, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి, త్వరలోనే ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామన్నారు వెంటనే ఐదు లక్షలతో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల ముందర సిసి రోడ్డు వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీదేవి అధికారులు, హౌసింగ్ శాఖ సిబ్బంది మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్, వార్డ్ మెంబర్ ,మంగలి రాజు, 1వార్డు మెంబర్ మన్నె రాములు, చంద్రయ్య, జీల ప్రసాద్, రాములు, డప్పురి శ్రీశైలం, బోయిని శ్రీశైలం, తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. త్వరలోనే ఇళ్ల పట్టాలు చేతికి రానుండటంతో స్థానిక లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అదనపు కలెక్టర్‌కు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ..



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు శనివారం బీఎల్‌వోలు ఎన్యుమరేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేసేలా విస్తృత అవగాహన కల్పించాలని, ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువతను ఓటర్లుగా నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హవేలీ ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలి దేవి ప్రసాద్..



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం మహా రాష్ట్రంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినట్లు ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు నెలల తరబడి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఏడు నెలలు, నిలోఫర్ ఆసుపత్రిలో తొమ్మిది నెలలు, పంచాయతీరాజ్ శాఖలో మూడు నెలలు, వరంగల్ ఈఎస్ఐ డిస్పెన్సరీలో నాలుగు నెలలుగా జీతాలు బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రౌండ్ వాటర్, మున్సిపాలిటీలు, ప్రభుత్వ ఆసుపత్రులు, పోలీస్ శాఖలు తదితర విభాగాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలిపారు. ఉద్యోగుల జీతాల నుంచి ఈఎస్ఐ, ఈపీఎఫ్ నిధులను మినహాయించినప్పటికీ సంబంధిత ఖాతాల్లో జమ చేయకుండా కొంతమంది ఏజెన్సీలు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని జీతాలను తక్షణమే విడుదల చేయాలని, ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేయని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈఎస్ఐ--ఈపీఎఫ్ చెల్లింపులు చేయని ఏజెన్సీలను బ్లాక్‌లిస్ట్ చేయాలని, ప్రభుత్వమే నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమ చేసే విధానాన్ని అమలు చేయాలని, అన్ని ఔట్సోర్సింగ్ ఏజెన్సీలపై ప్రత్యేక విచారణ చేపట్టాలని దేవీప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు.

## బి ఆర్ స్ నాయకుడు కృషంక్ బానుక మల్లికార్జున ఫైర్



**వాస్తవ తెలంగాణా డైలీన్యూస్ /**కంటోన్మెంట్ /నా వ్యక్తిగత విషయాలు గానీ రాజకీయ విషయాల్లో గాని నేను నా భార్య నర్మదా ఎలాంటి తప్పులు చేయలేదని నా జీవితం లో ఏ విషయంలో నైనా తెరిచిన పుస్తకం లాంటిదని సుమారు 35 ఏళ్ల నుంచి తాను తన భార్య నర్మదా కంటోన్మెంట్ ప్రజలకు కేవలం సంక్షేమవే ధ్యేయంగా పనిచేస్తున్నామని బిజెపి సీనియర్ నాయకుడు భానుక మల్లికార్జున్ పేర్కొన్నారు. ఆయన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల బిఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ చేసిన ఆరోపణలు ఆయన ఖండించారు తాను కబ్జా చేసి ఇల్లు కట్టా లేదని మా భార్యకు అంతగా చదువు రాదని హేళన చేస్తూ నిరాధారమైన ఆరోపణ చేశాడని అలాంటివి చౌకబారు విమర్శలను మానుకోవాలని ఆరోపణలను వ్యతిరేకించారు. క్రిశాంక్ బిఆర్ఎస్ పార్టీ తాత్కాలికగా ఇన్చార్జి మాత్రమేనని ఆ పార్టీలో ఉన్న గొడవ తన భవిష్యత్తు గురించి ఆలోచించుకోవాలి గాని ప్రజా సేవలో ఉన్న తనను విమర్శించే అంత స్థాయి కాదని ఆయన పేర్కొన్నారు కొందరు బిజెపిలో ఉండి వారి బొందని వారే తొవ్వుకున్నట్లు కొంతమంది సలహాలు విని క్రిశాంక్ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అలాంటి వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు తాను 21 లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన ఇంటి విషయం కోర్టులో ఉందని తాను ఇల్లు కొనుగోలు విషయాన్ని క్రిషక్ గమనించాలని కోరారు ఆ విషయం కోర్టులో ఉందని కోర్టులో ఉన్న విషయాన్ని క్రిశాంకు విమర్శించే హక్కు లేదన్నారు తాను తన భార్య గాని అవినీతి పనులు కబ్జాలుకు పాల్పడలేదని తన భార్య నామినేటెడ్ సభ్యురాలుగా రాజీనామా చేస్తే ఎన్నికలు వస్తాయంటే తాను సిద్ధమేనని సవాల్ విసిరారు. మా గురు సర్వే సత్యనారాయణ న్యాయవాదిగా ఇప్పుడు క్రిశాంక్ కారోపిస్తున్న స్థలాన్ని కాపాడేందుకు వచ్చి రక్షించారని ముందు ఈ విషయంలో వాళ్ల మామనే సంప్రదిస్తే వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

# ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలు తక్షణమే తీర్చాలి..

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం -- శంకర్‌పల్లి మండల శాఖ..




**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం శంకర్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ టి బాలకృష్ణా రెడ్డి కు వినతిపత్రం శనివారం సమర్పించారు. ఈ వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల మేరకు 51% ఫిట్‌మెంట్‌తో పిఆర్సి, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపు, జీవో-190 అమలు, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరణ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపిసి వర్తింపు, కేజీబీవీ, ఎస్ ఎస్ ఏ, ఎం టి ఎస్, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వేతనాల విడుదలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన శంకర్‌పల్లి డిప్యూటీ తహసీల్దారు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం శంకర్‌పల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, బసవరాజు మరియు మండల కార్యవర్గ సభ్యులు, జంగయ్య , కృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్ , రాజేందర్, హరిశంకర్, శ్రీకాంత్, జంగయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీగా శంకర్‌పల్లి మాజీ ఎంపీటీసీ ఎజాస్





**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీగా నియమితులైన శంకర్‌పల్లి మాజీ ఎంపీటీసీ ఎండి జైనుల్లావుద్దీన్ (ఎజాస్) చేవెళ్ళ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పామెన భీమ్ భరత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ లను శనివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎజాస్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎజాస్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కృష్ణారెడ్డి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు గా కౌకుట్ల ప్రకాష్ రెడ్డి..

-పరమేశ్వర్ రెడ్డి, బొంతు శ్రీదేవి కి కృతజ్ఞతలు తెలిపినా ప్రకాష్ రెడ్డి





**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం కుషాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి కౌకుట్ల ప్రకాష్ రెడ్డి నీ నియమించినా సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి నాయకులు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డిలి కి, అలాగే నా వెన్ను తట్టి ఎల్లప్పుడూ నన్ను ప్రోత్సహించిన చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలికి ప్రకాష్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కుషాయిగూడ కాంగ్రెస్ నాయకులకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ గెలుపుకు అహర్నిశలు కష్టపడి పని చేస్తానని కౌకుట్ల ప్రకాష్ రెడ్డి కుషాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలిపారు.

# బండ్లగూడలో కిగన్ స్పోర్ట్స్ షాప్ ను ప్రారంభించినా మాజీ చైర్మన్ చంద్రారెడ్డి...

క్రీడా స్ఫూర్తి తో ప్రారంభించినా రోంగలి గణేష్, కిరణ్మయి..





**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ బండ్లగూడా డివిజన్ లోని బండ్లగూడ పరిధిలో కిగన్ స్పోర్ట్స్ షాప్ నాగారం మాజీ చైర్మన్ బీజేపీ నాయకులు చంద్ర రెడ్డి ప్రారంభించారు. ఇందులో క్రికెట్ బ్యాట్స్, బాల్స్, షటిల్ బ్యాట్స్,టాయ్స్, సిమ్మింగ్ అండ్ స్కేటింగ్ డ్రెస్సులు,ఫుటబాల్ , బాస్కెట్ బాల్ అందుబాటులో ఉండేలా నేటి యువతరానికి ఉపయోగపడేలా మంచి వ్యాపార ప్రయోజనాల తో ఈ షాప్ ప్రారంభించబడింది అని చంద్ర రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.షాప్ యజమానులైనా రొంగలి గణేష్ మరియు రొంగలి కిరణ్మయ్ నీ చంద్ర రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో నాగారం మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, సంతోష్ గౌడ్, దయాకర్ రావు, నాయకులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

## జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా తరలించడం, మళ్లించడం లేదా దుర్వినియోగానికి పాల్పడితే సంబంధిత డీలర్లపై అత్యావశ్యక వస్తువుల చట్టం-1955లోని సెక్షన్ 6-ఏ కింద కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి. నిత్యానంద్ శనివారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు.అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్, వారి సిబ్బంది, హైదరాబాద్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీమ్-2 అధికారులతో కలిసి మెదక్ పట్టణంలోని ఎన్. నర్సమ్మ నిర్వహిస్తున్న ఫెయిర్ ప్రైస్ షాప్ నెం. 1784018లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.తనిఖీల్లో షాపులో 12.42 క్వింటాళ్ల సన్న బియ్యం, 61.28 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత డీలర్‌పై అత్యావశ్యక వస్తువుల చట్టం-1955 ప్రకారం సెక్షన్ 6-ఏ కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ (సివిల్ సప్లైస్) తదుపరి ఆదేశాలు వెలువడే వరకు దుర్గాప్రసాద్ నిర్వహిస్తున్న ఫెయిర్ ప్రైస్ షాప్ నెం. 1784002కు సదరు దుకాణం ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. జిల్లాలోని ఏ ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ అయినా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, మళ్లించడం లేదా దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలితే, వారిపై కూడా సెక్షన్ 6-ఏ కింద కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్ స్పష్టం చేశారు.

# మెదక్ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** మెదక్ జిల్లా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో వివిధ గ్రూపుల్లో ఉన్న ఖాళీల భర్తీకి ఈ నెల 6వ తేదీ (సోమవారం) స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త శ్రీమతి అనురాధ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.జిల్లాలోని అర్హులైన వివిధ వర్గాల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో ఉదయం 9 గంటలలోపు మెదక్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల (బాలికల) ప్రాంగణానికి హాజరుకావాలని ఆమె కోరారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్పాట్ అడ్మిషన్లలో పాల్గొనాలని జిల్లా సమన్వయకర్త అనురాధ సూచించారు.

# ఎంఎంసీలో తొలి కీసర డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రామిడి స్వప్న విజయ్ రెడ్డి

## - నాయకులకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ. పార్టీ గెలుపుకు అహర్నిశలు పనిచేస్తా..



**కీసర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ కీసర (1) డివిజన్ బాధ్యతలు స్వీకరణ.. పార్టీ బలోపేతం, ప్రజాసేవకు కృషి చేస్తానని హామీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ జులై 3 కీసర సర్కిల్ మున్సిపల్ పరిధిలోని కీసర (1) డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా శ్రీమతి రామిడి స్వప్న విజయ్ రెడ్డి నియమితులయ్యారు. ఎంఎంసీ (మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్) పరిధిలో కీసర (1) డివిజను తొలి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమె బాధ్యతలు చేపట్టడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ అధిష్ఠానం ఆమె సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.రామిడి స్వప్న విజయ్ రెడ్డి గత కొంతకాలంగా కీసర ప్రాంతంలో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు.ముఖ్యంగా పేదలు, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర పోషిస్తూ మహిళలు, యువతకు అండగా నిలుస్తున్న నాయకురాలిగా గుర్తింపు పొందారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయడంలో ఆమె ముందుంటారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థలఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా ఆమె పని చేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రామిడి స్వప్న విజయ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె నాయకత్వంలో కీసర (1) డివిజన్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రామిడి స్వప్న విజయ్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో కలిసి సమిష్టిగా పనిచేస్తానని తెలిపారు. మహిళలు, యువత రాజకీయాల్లో మరింత ముందుకు వచ్చేలా ప్రోత్సహించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# బాలాజీ నాగార్ శాంతి నాగర్ లో వివాహిత మృతి.. తల్లి ఫిర్యాదు మేరకు జవహర్ నాగర్ పోలీస్ స్టేషన్ లో కేస్ నమోదు



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్రా మండలం బాలాజీ నగర్ శాంతినగర్ కు చెందిన మృతురాలు మజ్జారి రేఖ, భర్త సాయికిరణ్, వయస్సు 21 సంవత్సరాలు, గృహిణి, శాంతినగర్, బాలాజీనగర్ నివాసి. ఆమెకు సుమారు మూడు సంవత్సరాల క్రితం సాయికిరణ్ (ఎక్సైజ్ కానిస్టేబుల్) తో వివాహం జరిగింది. వీరికి ఒక సంవత్సరం వయస్సు గల కుమారుడు ఉన్నాడు.తేదీ 03.07.3026 నాడు సుమారు మధ్యాహ్నం 4:00 గంటల సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో, ఆమె ఇంటి బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చీర కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది.అనంతరం ఆమె అత్త ఇంటికి వచ్చి చూడగా, రేఖ ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. వెంటనే స్థానిక నివాసితులకు సమాచారం అందించగా, మృతురాలిని అక్కడి నుండి కిందికి దింపి చూడగా రేఖ చనిపోయి ఉంది.సమాచారం అందుకున్న క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించింది. వెంటనే రేఖ తల్లి అయినా జయమ్మ వచ్చి చూడగా తన కూతురు చనిపోయింది అని కావున తన కూతురు మరణానికి అల్లుడు సాయి కిరణ్, అత్త, మామ కారణమని మృతురాలు తల్లి ఫిర్యాదుమేరకు జవహర్ నాగర్ పోలీస్ స్టేషన్ లో ఈ ఘటనపై కేసు నమోదు చేయబడింది.అని తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది అని పోలీసు అధికారులు తెలిపారు.

# ఆలయంలో దుర్వాసన.. భక్తుల అవస్థలు!






**వాస్తవ తెలంగాణా డైలీ న్యూస్ ఆల్వాల్ /.** నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న సిబ్బంది అల్వాల్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గత కొన్ని రోజులుగా ఆలయ ప్రాంగణంలో చెత్తాచెదారం భారీగా పేరుకుపోయింది. ఇటీవలే కురిసిన వర్షాలకు ఈ చెత్త అంతా తడిసి పోయి, కుళ్ళిపోవడంతో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది.దేవాలయ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే రోజురోజుకూ చెత్త కుప్పలు ఆలయ ప్రాంగణంలో పెరిగిపోతున్నాయని స్థానికులు, భక్తులు మండిపడుతున్నారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు ఆలయ ప్రాంగణంలో అడుగుపెట్టాలంటేనే ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పవిత్రమైన దేవాలయంలో ఇలాంటి అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని భక్తులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# కీసర పోలీస్ సర్కిల్ లో వరస దొంగతనాల్లో నిందితుల రిమాండ్, సొత్తు స్వాధీనం..

## –సర్కిల్ పోలీసులను అభినందించినా ఏసిపి చక్రపాణి..

**కీసర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ సర్కిల్ పరిధిలో రాత్రి వేళల్లో వరుసగా ఇళ్లలో చోరీలకు పాల్పడిన దొంగల ముఠా అరెస్ట్ -- నాలుగు ఇంటి చోరీ కేసులు ఛేదింపు -- సుమారు 22 తులాల బంగారు ఆభరణాలు, నేరానికి వినియోగించిన బుల్లెట్ మోటార్ సైకిల్ స్వాధీనం క్రైం నెంం.592/2026, 228/2026, 408/2026 ఒ 589/2026 [illegible]: 331(4), 305 r/w 3(5) బి ఎన్ ఎస్

**కేసు వివరాలు:** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో 2026 సంవత్సరంలో వివిధ ప్రాంతాలలో వరుసగా జరిగిన ఇంటి చోరీ సంఘటనలకు సంబంధించి క్రైం నెం.592/2026, 228/2026, 408/2026 మరియు 589/2026 కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. ఈ నాలుగు కేసులలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకుని ప్రధాన ద్వారాల తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలను అపహరించినట్లు ఫిర్యాదులు అందాయి.

దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో, తేదీ 04-07-2026న విశ్వసనీయ సమాచారం మేరకు లిడబ్బేట బాలలింగం (ఏ 1), డబ్బేట అశోక్ (ఏ 2), డబ్బేట చంద్రశేఖర్ (ఏ 3), డబ్బేట నవీన్ (ఏ 4), బక్కొల్ల బాబు (ఏ 5), కేతోని నరేష్ (ఏ 6), బక్కొల్ల రవి (ఏ 7)లిలను కీసర గ్రామ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకొని విచారించగా, వారు స్వచ్ఛందంగా తమ నేరాలను అంగీకరించారు. విచారణలో, A1 మరియు A2 మొదటగా కలిసి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఇంటి చోరీలకు పాల్పడినట్లు, అనంతరం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉ










ద్దేశ్యంతో A3 నుండి A7 వరకు తమతో కలుపుకొని ముఠాగా ఏర్పడి రాత్రి వేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలు చేసినట్లు వెల్లడించారు. నేరం జరిగే సమయంలో A1 ఇళ్ల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీలకు పాల్పడగా, A2 నేరానికి ఉపయోగించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్ సైకిల్ నెం. TS13ES 4164 తో బయట కాపలా ఉండేవాడు. A3 నుండి ఎూ7 వరకు పరిసర ప్రాంతాల్లో ప్రజలు, పోలీసుల కదలికలను గమనిస్తూ నిఘా నిర్వహించి నేరానికి సహకరించినట్లు ఒప్పుకున్నారు. నిందితుడు డబ్బేట బాలలింగం (ఏ 1) ఒక హ్యాబిట్యువల్ ఆఫెండర్‌గా వ్యవహరిస్తూ గతంలో కూడా (45 క్రిమినల్ కేసుల్లో) పాలుపంచుకున్నాడు. అతనిపై గతంలోనే గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రివెంటివెవ్స్ డిటెన్షన్ యాక్ట్ (పి డి యాక్ట్) క్రింద నిరోధక నిర్బంధ చర్యలు అమలు చేశారు. ఇతని పై హిస్టరీ షీట్ కూడా నమోదు తెరవబడి ఉన్నది. నిందితుల స్వచ్ఛంద ఒప్పుకోలు మేరకు పోలీసులు క్రింది చోరీ కేసులను ఛేదించి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. క్రైం నెం.228/2026కు సంబంధించి ఒక బంగారు నెక్లెస్, ఒక బంగారు గాజు, ఒక జత బంగారు మెట్టెలు, ఒక నల్లపూసల తాడు, రెండు బంగారు ఉంగరాలు, మొత్తం సుమారు 6 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. క్రైం నెం.408/2026కు సంబంధించి సుమారు 4 తులాల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. క్రైం నెం.592/2026కు సంబంధించి ఒక బంగారు నెక్లెస్, ఒక నానుతాడు (గోపీ తాడు), ఒక జత చెవి రింగులు, లాకెట్‌తో కూడిన గొలుసు, ఒక బ్రాస్లెట్, రెండు బంగారు ఉంగరాలు, గోధుమరంగు రాయి పొదిగిన ఉంగరం, ఒక లాకెట్, ఒక జత చిన్న చెవి రింగులు, ఒక బటువు, రెండు చిన్న ఉంగరాలు, మొత్తం సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా సుమారు 22 తులాల బంగారు ఆభరణాలను, నేరాలకు వినియోగించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్ సైకిల్ నెం. TS13ES4164ను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని కేసులకు సంబంధించిన వెండి ఆభరణాలను నిందితులు గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించినట్లు విచారణలో వెల్లడికాగా, వాటి స్వాధీనం మరియు కొనుగోలుదారుల గుర్తింపు కోసం దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులను చట్టప్రకారం అరెస్టు చేసి గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరచడం జరుగుతుంది. నిందితుల ఇతర ఆస్తి నేరాల్లో ప్రమేయం, మిగిలిన చోరీ సొత్తు స్వాధీనం, కొనుగోలుదారుల గుర్తింపు తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. **ప్రజలకు విజ్ఞప్తి:** ప్రజలు తమ ఇళ్లను తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో పొరుగువారికి సమాచారం ఇవ్వడం, విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఇంటిలో భద్రపరచకుండా బ్యాంకు లాకర్లలో ఉంచడం, నివాసాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100 / 112కు సమాచారం అందించాలని కీసర పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కేసుల దర్యాప్తు మల్కాజ్గిరి డీసీపీ శ్రీధర్, సి సి ఎస్ డి సి పి గుణ శేఖర్ మరియు సి సి ఎస్ అడిషనల్ డి సి పి శ్రీ. రామేశ్వర్ పర్యవేక్షణలో, జవహర్ నగర్ ఏసీపీ మార్గదర్శకత్వంలో, కీసర పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీ బిక్కి రమేశ్, సి సి ఎస్ ఇన్స్పెక్టర్ ఏ. రవి కుమార్, ఆధ్వర్యంలో, జీ. నర్సింహులు, శ్రీ, ప్రభాకర్ , శ్రీధర్, హెడ్ కానిస్టే బుల్, ఎస్. అనిల్ కుమార్, సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కీసర పోలీస్ స్టేషన్ మరియు సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించి, నాలుగు ఇంటి చోరీ కేసులను ఛేదించి నిందితులను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు అని పోలీస్ ఏ సి పి చక్రపాణి, కీసర సి ఐ ఆంజనేయులు తెలిపారు.

---

- **పరిపాలనలో జోక్యం**
- **ఐఏఎస్ అధికారులకు ఆదేశాలు**
- **మంత్రులకు తెలియకుండానే బదిలీలు**
- **ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుకు చేదు అనుభవం**
- **ఆసక్తికరమైన విషయాలు వెలుగులో**
- **మీడియాకు వివరాలు వెల్లడించిన మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్**

# తెలంగాణలో.. షాడో సీఎం!

## సీఎం రేవంత్ సతీమణిదే హవా



పరిపాలనలో సీఎం రేవంత్‌రెడ్డికి పట్టు లేదని, మంత్రులకు తెలియకుండానే బదిలీలు జరగడం దీనికి నిదర్శనమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ ఆరోపించారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలు షేర్ చేసుకున్నారు. కాగా, తనకు హిట్లర్ ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలపై కిశోర్ వ్యంగ్యంగా స్పందించారు. రేవంత్ రెడ్డి తనకు హిట్లర్ ఆదర్శమని చెబుతుంటారని, పాపం చదువుకోలేదు కాబట్టి ఆయన్ను తప్పుబట్టడానికి లేదని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. హిట్లర్ ఆదర్శమని.. అనాలో.. అనకూడదో కూడా ముఖ్యమంత్రికి తెలియదని సానుభూతి చూపించారు.

### మానసిక సంఘర్షణతో హిట్లర్ ఆత్మహత్య..

హిట్లర్ పుస్తకం మొత్తం చదవనట్లు ఉన్నాడని.. హిట్లర్ రేవంత్ రెడ్డిలా ఇలాగే పిచ్చిపనులు చేసి, ఆగమాగమై.. మానసిక సంఘర్షణకు లోనై ఆత్మహత్య చేసుకున్నాడని గ్యాదరి కిశోర్ తెలిపారు. దయచేసి ముఖ్యమంత్రిగారూ మీరు అలాంటి పనులు చేయవద్దని సూచించారు. పిచ్చి పిచ్చి పనులు చేసి, మానసిక సంఘర్షణకు లోనై ఆత్మహత్య చేసుకోవద్దని కోరారు. హిట్లర్ ఆదర్శమని చెప్పి.. పుసుక్కున హిట్లర్ చేసినట్టే చేసేవని వ్యాఖ్యానించారు. నువ్వు మా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివి కాబట్టి బాగుండాలని కోరుకుంటామని అన్నారు. నువ్వు మంది చావు కోరుకుంటావేమో కానీ.. మేం అలా కోరుకోమని స్పష్టం చేశారు.

### ఐఏఎస్ ఆఫీసర్లకు ఆదేశాలు.. సీఎం సతీమణి జోక్యం..

కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రికి తెలియకుండానే సంబంధిత విభాగంలో బదిలీలు జరుగుతున్నాయని గ్యాదరి కిశోర్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే పరిపాలన విషయంలో సీఎం రేవంత్ సతీమణి జోక్యం చేసుకుంటున్నట్టు గ్యాదరి కిశోర్ ఆరోపించారు. ఐఏఎస్ ఆఫీసర్లకు నేరుగా రేవంత్ సతీమణి ఆదేశాలు ఇస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. టీ శాట్‌ను ఐటీ డిపార్ట్‌మెంట్ నుంచి తొలగించి ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకుని.. తనకు కావాల్సిన వ్యక్తికి ముఖ్యమంత్రి ఎక్స్‌టెన్షన్ జీవో ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ఇది మంత్రి శ్రీధర్ బాబుకు తెలియకుండానే జరిగిందని అంటున్నారని.. అలాంటి పరిస్థితి ఎదురైతే మంత్రి పదవికి రాజీనామా చేయాలి కదా అని ఆయన ప్రశ్నించారు.

వాస్తవ తెలంగాణ

## అడుగంటిన జీవనది



# గోదావర్రీ

## అన్నదాతకు కన్నీటి గోస

- వర్షకాలం ప్రారంభమై నెల దాటినా నీటి కరువు
- ఎగువ ప్రాంతాల్లో వర్షా లు లేక పడిపోయిన నీటి మట్టాలు
- డిగడ్డ, భద్రాచలం, పోలవరం, రాజమండ్రి,
- ళేశ్వరంలో ఇసుక తిన్నెలు దర్శనం
- ావరి పరీవాహకంలో కురవని వానలు
- ుతికి ఎల్‌నినో దెబ్బ..
- ావరి డెల్టాలో నీటికి కటకట
- లక్షల ఎకరాల సాగు ప్రశ్నార్థకం

గోదావరి బేసిన్ ప్రాంతంలో వర్షా భావం, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వల్ల నదిలో నీటి కొరత తీవ్రంగా ఉంది. ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు అడుగంటడం , కాలుష్యం కారణంగా తాగునీటి సరఫ రాకు, వ్యవసాయానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రుతుపవనాల ఆలస్యం , వర్షా లు కురవకపోవడంతో జలాశయాలకు వరద నీరు చేరడం లేదు. ఎగువ ప్రాంతాల నుంచి నీటి లభ్యత తగ్గడంతో ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. జీవనది నీటిపై ఆధార పడిన అయిదు రాష్ట్రాల రైతులు సాగు నీరు అందక అల్లాడిపోతున్నారు. ఒక్క గోదావరి నదిలో నీళ్లు లేకపోవడంతో దీనిపై ఆధారపడి సాగయ్యే ఏపీ, తెలంగాణాలోని 50 లక్షలకు పైగా ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

### దక్షిణ గంగ..

దక్షిణ భారతదేశంలో అతి పొడవైనది, అతిపెద్దదైన నది గోదావరి. దీనిని 'దక్షిణ గంగ' అని కూడా పిలుస్తారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా త్రయంబకేశ్వర్ వద్ద పుట్టి, మొత్తం 1,465 కిలోమీటర్లు ప్రవహించి ఆంధ్రప్రదేశ్ లోని అంతర్వేది వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్ గడ్, ఒడిశా, అంధ్రప్రదేశ్ లో ఈ జీవనది ప్రవాహం కొనసాగుతున్నది. అయితే జులై వచ్చినా గోదావరి పరవళ్లు కనిపించడం లేదు. వేసవిలో నది అడుగంటినా, జూన్ నుంచి ప్రవాహం పుంజుకుని జులై, ఆగస్టు నెలల్లో నిండుగా ప్రవహించేది. ఏటా ఈ సమయానికి గోదావరి నీటిమట్టం 25 అడుగులకు పైబడి ఉండాలి. ఈ శుక్రవారం నాటికి భద్రాచలం వద్ద 2.60అడుగుల స్థాయిలో, దవళేశ్వరం వద్ద నామ మాత్ర నీటి మట్టం ఉందంటే నదీ ప్రవాహం ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### మహారాష్ట్రలో వర్షాలు కురుస్తున్నా..

మహారాష్ట్రంలో గత వారం రోజులుగా వానలు కురుస్తున్నా గోదావరిలో జలకళ కనిపించడం లేదు. వాస్తవానికి ఈ వానలన్నీ మహారాష్ట్రలోని సముద్ర తీర ప్రాంతంలో పడటం వల్ల నీరంతా సముద్రంలోకే పోతున్నది. నాగపూర్ అమరావతి, మధ్య మహారాష్ట్రలో నామమాత్ర వానల వల్ల గోదావరిలో నీటి ప్రవాహం అంతంతమాత్రంగానే ఉంది.. అక్కడ గోదావరి నదులపై ఉన్న ప్రాజెక్ట్ లలో నీరు నిండితే తప్ప తెలంగాణ, ఏపీలకు నీటి ప్రవాహం వచ్చే అవకాశం లేదు. ముందుగా నీరు తెలంగాణలోని మేడిగడ్డకు, అక్కడ నుంచి భద్రాచలానికి, ఆపై పోలవరానికి ప్రవాహం సాగి దవళేశ్వరం బరాజ్‌కు చేరాల్సి ఉంది.



### నైరుతికి ఎల్‌నినో దెబ్బ

నైరుతీ రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభకావడం, ఎల్‌నినో వేడి గాలులు అడ్డుకోవడంతో ఈ సీజన్‌లో ఇప్పటికే 47 శాతం వర్షపాతం లోటు కనిపిస్తున్నది. దీనికి తోడు ఉత్తర తెలంగాణలో గణనీయంగా వర్షా లు కురవకపోవడంతో వాగుల్లో , వంకల్లో, నీటి ఎద్దడి ఏర్పడింది. గోదావరిలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు రాకపోవడంతో మేడిగడ్డ వద్దే ఇసుక తిన్నెలు కనిపిస్తున్నాయి. భద్రాచలం, పొలవరంలో సైతం నీటి ప్రవాహం లేక వెలవెలబోతున్నాయి.. ఇక ఏపీలో సైతం ఉత్తరాంధ్రలో వర్షా లు కురుస్తున్నాయే తప్ప గోదావరి డెల్టా ప్రాంతంలో వర్షం కనిపించడం లేదు. దీంతో గోదావరిలో కలిసే అనేక ఉపనదులు, వాగులు , వంకల నీళ్లు రావడం ఆగిపోయింది. దీంతో గోదావరికి జలకళ తప్పింది.

### గోదావరి బేసిన్‌లో..

జూన్ మొదటి వారంలోనే గోదావరి బేసిన్‌లో వరద ప్రవాహం మొదలవుతుంది. కానీ జులై తొలి వారం వచ్చినా కూడా వరద జాడ లేకుండా పోయింది. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎక్కడా చినుకు జాడ లేదు. అడపాదడపా కురిసిన వర్షాలకు చేరిన నీరు తెలంగాణలోని ఎగువ ప్రాంతంలో ఉన్న బ్యారేజీల్లోనే ఉంటున్నాయి. దాంతో కిందికి ప్రవాహం రాక, నది వెలవెలబోతోంది మహారాష్ట్ర అప్పర్ గోదావరిలో సైతం వరద ప్రవాహాలు లేకుండాపోయాయి. గోదావరి బేసిన్‌లోని ప్రధాన ప్రాజెక్టులన్నీ అడుగంటాయి. ప్రధాన గోదావరిలో ఈ ఏడాది ఇప్పటికీ వరద ప్రవాహాలు ప్రారంభమే కాలేదు. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, నిజాంసాగర్, మంజీరా, శ్రీరాజరాజేశ్వర జలాశయం, దిగువ మానేరు తదితర ప్రాజెక్టులన్నీ కనీస నీటి నిల్వలు లేక వెలవెలబోతున్నాయి.

### కృష్ణా డెల్టాకు..

నదిలో ప్రవాహం లేకపోతే ఆ ప్రభావం గోదావరి జిల్లాలతో పాటు ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలపై కనిపిస్తోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో డెల్టా ఆయకట్టుకు ఈ జలాలే ఆధారం. ఇక గోదావరి నిండుగా ఉంటే పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు నీరు ఎత్తిపోసేవారు. 2016 నుంచి 2025 వరకూ జూన్, జులై నెలల్లోనే పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు సరఫరా చేసేవారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఆ పరిస్థితి కనిపించలేదు. నదీ పరీవాహక ప్రాంతంలో వర్షా లు దండిగా కురిస్తే తప్ప, గోదావరి వెతలు తీరవు. కాగా, జూన్ తొలివారంలోనే గోదావరి కాలువల ద్వారా సాగునీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో ఎన్నో ఆశలతో డెల్టా రైతులు 12 లక్షల ఎకరాల్లో వరిసాగు ను ప్రారంభించారు. అయితే గోదావరికి ఎగువనుంచి నీరు రాకపోవడంతో కాలువల్లో నీటి ప్రవాహ పడిపోయింది. వరి వేసిన రైతులు కనీసం నారుమళ్లకు సైతం నీరందడం లేదని గగ్గోలు పెడుతున్నారు.. జీవనదిగా అయిదు రాష్ట్రాలకు సస్యశ్యామల ప్రదాయనిగా పేరు గాంచిన గోదావరిలో నీటి మట్టాలు పడిపోవడం 30 ఏళ్ల తర్వాత ఇదే ప్రథమం అంటున్నారు.. గోదావరి నీళ్లపై రైతాంగం ఇప్పుడు వర్షం కోసం ఆకాశం వైపు దిక్కులు చూస్తున్నారు.

